# రివర్స్ గేర్

- ఎస్.రాజేశ్వరిశర్మ





ఆ రోజు నారాయణ పదమూడో పెళ్లిచూపులు. తల్లిదండ్రి ప్రొద్దుటి నుంచి టెన్షన్ పడుతూనే వున్నారు.

ఇంతవరకూ చూసిన పన్నెండు పెళ్లిచూపులలోను వారికి నచ్చిన అమ్మాయి దొరకలేదు.

అందముంటే చదువులేదు, పోనీ రెండూ వుంటే ఆస్తిపాస్తులులేవు. పోనీ నాలుగూ వుంటే అమ్మాయికి గవర్నమెంటు ఉద్యోగంలేదు.

ఇలా నారాయణకి నచ్చడం అటుంచి నారాయణ తల్లిదండ్రులకే నచ్చడంలేదు.

నారాయణ సాధారణమైన చదువుతో మహానగరంలో ఏదో గుమాస్తాగిరీ వెలగబెడుతున్నాడు.

ఏదో కొంచెం తెలుపు ఛాయ కలిగినందుకు తమ కొడుకును మించిన అందగాళ్ళు లేరని, సొంత ఇల్లుకు తమ తదనంతరం వాడే వారసుడని, అందుకని పెళ్లి విషయంలో తిరుగులేని సంబంధం చేయాలని నారాయణ తల్లిదండ్రుల లక్ష్యం.

కోడలి ఎంపికలో ముందు వెనుకలు ఆలోచించడంతో ముప్పై రెండు నిండి ముప్పై మూడులో అడుగుపెట్టిన విషయం కూడా పక్కన పెట్టేసారు.

సాయంత్రమే పెళ్లిచూపులు. మధ్యాహ్నం మూడింటి నుంచి ఆర్భాటం మొదలై సాయంత్రం ఆరింటికి ఆడపెళ్లివారింటికి చేరుకున్నారు.

వాళ్లు వీళ్లని సాదరంగా ఆహ్వానించి మర్యాదలు చేసి కూర్చోబెట్టారు.

"పెళ్లికూతుర్ని తీసుకురండి" అన్నారు మధ్యవర్తులు.

పెళ్లికూతురు వచ్చి కూర్చుంది.

నారాయణకి ఆ పిల్ల నచ్చింది.

ఇంకేం వారు కోరుకున్నవన్నీ వున్నాయి.

ఒక్కత్తే పిల్ల, తంతే బూర్ల గంప అనుగున్నారు నారాయణ తల్లిదండ్రులు.

పైకి 'మేం ఇంటికి వెళ్లి కబురు చేస్తాం' అన్నారు మగపెళ్లివారమన్న దర్పం తగ్గకుండా.

"అలాగేనండీ! మంచిది" అని ఆడపెళ్లివారు వాళ్లని సాగనంపారు.

నారాయణ కూడా తల్లిదండ్రుల వ్యాపారల, వ్యవహార శైలి తెలుసు కనుక అభ్యంతరం పెట్టలేదు.

తాము కోరుకున్న లాంఛనాలు వున్న సంబంధం కుదరబోతున్నందుకు ఉబ్బితబ్బిబ్బయ్యారు నారాయణ కుటుంబం.

వెంటనే ఒప్పుకున్నట్లు కబురు చేస్తే లోకువ అవుతాం అనుకుని ఒక పదిరోజులు ఆగి కబురు చేసారు 'మాకు పిల్ల బాగా నచ్చింది. ముహూర్తాలు గురించి మాట్లాడుకుందాం రమ్మని' మధ్యవర్తితో.

మధ్యవర్తి వెంటనే వచ్చాడు తిరిగి.

"పిల్ల తండ్రి రాలేదా?" అని అడుగుతున్న నారాయణ తండ్రితో-

"అయ్యా క్షమించాలి" అన్నాడు.

"ఏం... ఏమైంది?" లోపల కంగారు బయట పడకుండా.

మధ్యవర్తి సందేహపడడం గమనించి "ఫర్వాలేదు. వాళ్ళు ఎప్పుడు వస్తామన్నారు?"

"వాళ్ళు రారటండి! ఆ అమ్మాయికి మీ అబ్బాయి నచ్చలేదటండి. పైగా వయసు కాస్త ఎక్కువ, నాకు ఈ అబ్బాయి వద్దని చెప్పిందటండి. అయినా ఈ కాలం పిల్లలకి ఇంత పొగరుటండి?" అంటున్న మధ్యవర్తి మాటలు విని పించలేదు నారాయణ తండ్రికి. తల తిరిగినట్లయి 'ఇలా రివర్స్ అయిందేమిటి సుమా!' అని ఆలోచనలో పడ్డాడు.

ఇప్పుడు పెళ్లికూతురు వీళ్ళకి నచ్చడం కాదు, 'మన అబ్బాయి అవతల వారికి నచ్చుతాడా?' అని అసలు టెన్షన్ ప్రారంభమైంది పాపం పెళ్లికొడుకు తల్లిదండ్రులకు.

★